ప్రజాశక్తి
శుక్రవారం 21 జులై 2023 5 అనంతపురం



ఎస్‌కెయు డిగ్రీ రెగ్యులర్ ఫలితాలు విడుదల

42.93 శాతం ఉత్తీర్ణత



ఫలితాలను విడుదల చేస్తున్న విసి, అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం

ఎస్‌కెయు పరిధిలో గత మార్చిలో నిర్వహించిన డిగ్రీ రెగ్యులర్ మూడవ సెమిస్టర్ ఫలితాలను ఉపకులపతి మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి గురువారం సాయంత్రం విడుదల చేశారు. డిగ్రీలోని అన్ని బ్రాంచులు కలిపి 12,590 మంది పరీక్షలు రాయగా 5405 మంది ఉత్తీర్ణతతో 42.93 శాతం సాధించినట్లు తెలిపారు. బీఎస్సీలో 5020 మందికి 2768, బిఎలో 1123 మందికి 333, బి.కామ్‌లో 5442మందికి 1888, బీసీఏలో 33 మందికి 16, బీబీఏలో 972మందికి 400 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమములో వర్శిటీ పరీక్షల విభాగం అధికారులు, పిఆర్‌ఓ రాంగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుకు నిరసన పోరు

మున్సిపల్ కార్మికులు..

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని, ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులు నిరసన దీక్షలు చేపట్టారు. సిఐటియు అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆయా మున్సిపల్ కార్యాలయాల వద్ద గురువారం నుంచి రిలేదీక్షలు ప్రారంభించారు. జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పారిశుధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. స్కిల్, సెమీస్కిల్డ్ ప్రకారం వేతనాలు ఇవ్వాలన్నారు. వీటితో పాటు కార్మికులు ఎదర్కొంటున్న సమస్యలంటినీ పరిష్కరించాలని రిలేదీక్షల్లో నాయకులు డిమాండ్ చేశారు.




అనంతపురం మున్సిపల్ కార్మికుల రిలేదీక్షల్లో మాట్లాడుతున్న జి.ఓబులు

వార్త 6లో

విఆర్‌ఎలు

సమస్యల పరిష్కారం కోరుతూ విఆర్‌ఎలు నిరసన బాట పట్టారు. సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆయా తహశీల్దార్ కార్యాలయాల ఎదుట రిలేదీక్షలను ప్రారంభించారు. ఆయా కార్యాలయాల వద్ద అధికారులను కలిసి వినతిపత్రాలను అందజేశారు. గ్రామ రెవెన్యూ సహాయకులకు ప్రభుత్వం పే స్కేల్‌ను అమలు చేసి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విఆర్‌ఎలను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. మరణించిన విఆర్‌ఎల కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం కింద ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలన్నారు. అర్హులందరికీ ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. వీటితో పాటు ఎన్నిక ముందు జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని రిలేదీక్షల్లో నాయకులు డిమాండ్ చేశారు.



గుత్తిలో నిరసన తెలుపుతున్న విఆర్‌ఎలు

వార్త 6లో

సెబ్‌కు బడ్జెట్ కొరత

- సిబ్బంది కూడా అరకొరే
- సమస్యలతో సతమతమవుతున్న సెబ్ స్టేషన్లు
- కట్టడి కాని కర్నాటక మద్యం అమ్మకాలు





ప్రజాశక్తి-అనంతపురం క్రైం

నూతన మద్యం పాలసీలో భాగంగా మద్యం షాపులను ప్రభుత్వమే నిర్వహించడంతో పాటు మద్యం ధరలను భారీగా పెంచింది. దీంతో మద్యం ప్రియులు, గ్రామాల్లో దొంగ చాటుగా మద్యం అమ్మేవారి కన్ను పొరుగు రాష్ట్రమైన కర్నాటకపై పడింది. కర్నాటక నుంచి తక్కువ ధరకు మద్యాన్ని దొంగచాటుగా తెచ్చి అమ్మడం అధికమైంది. దీన్ని నిరోధించడానికి ప్రభుత్వం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) ను ఏర్పాటు చేసింది. అయితే ఈ సెబ్ సిబ్బంది, బడ్జెట్ కొరతతో ఇబ్బందులు పడుతోంది.

కర్నాటక మద్యాన్ని కట్టడి చేసేందుకు ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా 10 సెబ్ స్టేషన్లు ఏర్పాటు చేసింది. గతంలో ఎక్సైజ్ స్టేషన్లుగా ఉన్న వాటిని సెబ్ స్టేషన్లుగా మార్చింది. వీటిలో కంబదూరు, కళ్యాణదుర్గం, కణేకల్లు, రాయదుర్గం స్టేషన్లు కర్నాటక సరిహద్దుకు అత్యంత సమీపంలో ఉన్నాయి. ఒక్కో స్టేషన్‌కు నాలుగు నుంచి ఆరు మండలాలు కేటాయించారు. ఆయా మండలాల పరిధిలో ప్రధానంగా కర్నాటక మద్యం, నాటుసారా తయారీని అరికట్టడం, డ్రగ్స్ నియంత్రణ, మట్కా, జూదం వంటి వాటిని కట్టడి చేయాల్సి ఉంటుంది. అయితే స్టేషన్లకు కావాల్సిన సిబ్బంది, బడ్జెట్ కేటాయింపుల్లో మాత్రం విఫలమైందనే చెప్పవచ్చు. ఉదాహరణకు గతంలో అనంతపురం నగరంలోని ఎక్సైజ్ స్టేషన్లో ఒక సిఐ, ముగ్గురు ఎస్‌ఐలు, ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు, 12 మంది కానిస్టేబుళ్లు ఉండేవారు. ప్రస్తుతం సెబ్ స్టేషన్‌గా మార్చిన తర్వాత ఒక సిఐ, ఒక ఎస్‌ఐ, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, 9 మంది కానిస్టేబుళ్లు మాత్రమే నియమించింది. అనంతపురం నగర సెబ్ స్టేషన్ పరిధిలోకి అనంతపురం, రాప్తాడు, కూడేరు, ఆత్మకూరు మండలాలు వస్తాయి. ఈ స్టేషన్ల నిర్వహణకు నెలకు కేవలం రూ.10 నుంచి 15 వేల బడ్జెట్ మాత్రమే కేటాయిస్తూండటంతో రైడ్‌లకు వెళ్లే వాహనం డీజిల్ కూడా వేయించలేక పోతున్నామని సెబ్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతి స్టేషన్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

యథేచ్ఛగా కర్నాటక మద్యం..

సిబ్బంది, బడ్జెట్ కొరతతో సెబ్ సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వర్తించలేక పోతున్నారు. ఇదే అదనుగా కర్నాటక నుంచి మద్యాన్ని దొంగ చాటుగా తెచ్చే స్మగ్లర్లు చెలరేగిపోతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు గతంలో షాపుల నుంచి మద్యాన్ని తీసుకుని వెళ్లి గ్రామాల్లో అమ్మేవారు. ప్రస్తుతం కర్నాటక మద్యాన్ని రాత్రి వేళల్లో ఆటోలలో, టాటా సుమోలో తీసుకుని వచ్చి ఇంటి వద్దకు డోర్ డెలివరీ ఇస్తున్నారంటే కర్నాటక మద్యం అమ్మకందారులు ఏ స్థాయిలో చెలరేగిపోతున్నారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఎక్కువగా ఆత్మకూరు మండలానికి పేరూరుకు సమీపంలో ఉన్న బీకే హళ్లి నుంచి, కళ్యాణదుర్గం, కంబదూరు మండలాల్లోని గ్రామాలకు శెట్టూరు మండలానికి సమీపంలో ఉన్న జాలేటి నుంచి అనంతపురం రూరల్ మండలానికి కనేకల్లు నుంచి తెల్లవారుజామున వచ్చే పాసింజర్ వాహనాల్లో కర్నాటక నుంచి టెట్రా పాకెట్లను తెచ్చి గ్రామాల్లో డోర్ డెలివరీ ఇస్తున్నట్లు సమాచారం. ఎన్ని చర్యలు తీసుకున్నా కర్నాటక మద్యం జిల్లాకు రాకుండా నియంత్రించడంలో సెబ్ అధికారులు విఫలం అవుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం స్పందించి తమకు అవసరమైన సిబ్బందిని, నిధులను సమకూరిస్తే నాటుసారాను, కర్నాటక మద్యం కట్టడికి మరింత కృషి చేసేందుకు వీలుంటుందని సెబ్ అధికారులు చెబుతున్నారు.

గురుకుల పాఠశాలలో సీట్ల సంఖ్య పెంచాలి

డిసిఒ కార్యాలయం ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ ధర్నా



ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలోని గురుకుల పాఠశాలలో సీట్ల సంఖ్య పెంచాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. గురువారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో డిసిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరువు జిల్లాలో వందలాది మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలు నివసిస్తున్నారని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లో పంటలు పండక కరువు ఏర్పడుతోందన్నారు. ఈ క్రమంలో జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు బెంగళూరు, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు తదితర రాష్ట్రాలకు ప్రజలు వలస వెళ్తుంటారని తెలిపారు. అదే సందర్భంలోనే తమ పిల్లలను చదివించుకోవాలని కోటి ఆశలతో గురుకుల పాఠశాల సీట్లు కోసం తల్లిదండ్రులు దరఖాస్తు చేశారని తెలిపారు. పాఠశాల ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో అర్హత కలిగిన విద్యార్థులకు, ఆర్థికంగా వెనకబడిన, సామాజికంగా వెనకబడిన విద్యార్థులకు గురుకుల పాఠశాలలో సీట్లు రాకపోవడం బాధాకరమన్నారు. తమ పిల్లల్ని గురుకుల పాఠశాలలో ప్రవేశం కల్పించాలని మారుమూల గ్రామీణ ప్రాంతాల నుంచి డిసిఓ కార్యాలయం చుట్టూ ప్రతి రోజు విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రదర్శనలు చేస్తున్నారని తెలిపారు. అధికారులు మాకు ప్రభుత్వం కేటాయించిన సీట్లు పక్కాగా భర్తీ చేస్తున్నామని చెప్పడం పరిపాటిగా మారిందన్నారు. దీంతో కొంతమంది తల్లిదండ్రులు డిసిఒ కార్యాలయం చుట్టూ ప్రదర్శనలు చేయలేక తమ పిల్లల్ని ఇంటి దగ్గరే ఉంచుకునే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. మరి కొంతమంది తమతో పాటు పిల్లల్ని వలస తీసుకెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలన్నారు. విద్యార్థినులకు గురుకుల పాఠశాలలో రక్షణ కల్పించాలని, అత్యాచారాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. అలాగే గురుకుల పాఠశాలలో సీట్ల సంఖ్య పెంచాలన్నారు. అనంతరం డిసిఓ మురళీకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు రజిత, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యప్రకాష్, జిల్లా నాయకులు శివ, వర్ధన్ చంద్ర, రాజేష్, వినోద్, శివమ్మ, ఓంకార్, తదితర విద్యార్థి నాయకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'భారతి'కి ఆర్‌డిటి అండ

అభినందించిన ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూ ఫెర్రర్



భారతిని సన్మానిస్తున్న మాంఛూఫెర్రర్

ప్రజాశక్తి-అనంతపురం

ఇటీవల నిరుపేద కుటుంబం నుంచి కష్టాలకు ఎదురీది పిహెచ్‌డి సాధించిన డాక్టర్ భారతిని ఆర్‌డిటి ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూఫెర్రర్ అభినందించారు. ఈమేరకు గురువారం నగరంలోని తన కార్యాలయంలో భారతిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ భారతికి ఆర్డీటి సంస్థ ద్వారా అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. ఎలాంటి సాయం కావాలన్నా ఆర్డీటీ అన్నివేళలా సిద్ధంగా ఉంటుందన్నారు. మాంఛూను కలిసిన వారిలో నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ హరిత, వైసిపి నాయకులు చామలూరు రాజగోపాల్, కుటుంబ సభ్యులు ఉన్నారు.

కౌలు రైతులకు బ్యాంకు రుణాలివ్వాలి

కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగారెడ్డి, బాల రంగయ్య



బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడుతున్న కౌలు రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

కౌలు రైతులకు బ్యాంకు రుణాలు ఇచ్చి ఆదుకోవాలని కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగారెడ్డి, బాల రంగయ్య డిమాండ్ చేశారు. గురువారం కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో మండలంలోని ఆమిద్యాల గ్రామంలో ఉన్న యూనియన్ బ్యాంకు మేనేజర్ కిరణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 30 వేల మంది కౌలురైతులు ఉంటే ప్రభుత్వం 5200 మందికి మాత్రమే సిసిఆర్‌సి కార్డులు మంజూరు చేసిందన్నారు. సిసిఆర్‌సి కార్డులున్న కౌలు రైతులకు ఇప్పటివరకు బ్యాంకు రుణాలు ఇవ్వకుండా బ్యాంకు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఎకరాకు రూ.30 నుంచి రూ.40 వేల వరకూ ముందస్తు గుత్తు చెల్లించి వ్యవసాయ పొలాల్లో పనులు చేసినా సకాలంలో వర్షాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం కౌలు రైతులకు ఎలాంటి సహాయ, సహకారాలు అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కనీసం బ్యాంకుల ద్వారానైనా కౌలు రైతులకు రుణాలు అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు రైతు భరోసా, పంట నష్టపరిహారంతో పాటు పంటల బీమా ఇవ్వాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో ప్రభుత్వ, బ్యాంకు అధికారుల నిర్లక్ష్యంతో కౌలు రైతులు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. ఇప్పటికైనా స్పందించి ప్రతి ఒక్క కౌలు రైతుకూ రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు వెంకటేశులు, కుళ్లాయప్ప, లక్ష్మీనారాయణమ్మ, చిట్టెమ్మ, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాల్టీ అభివృద్ధికి నిధులివ్వండి

మున్సిపల్ మంత్రిని కోరిన ఛైర్‌పర్సన్ శిల్ప



మంత్రిని సన్మానిస్తున్న రాయదుర్గం మున్సిపల్ ఛైర్‌పర్సన్ శిల్ప, తదితరులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పురపాలక సంఘంలో వివిధ అభివద్ధి పనులు చేపట్టేందుకు 76.80 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయాలని పురపాలక సంఘం అధ్యక్షులు పోరాలు శిల్ప రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలం సురేష్‌ను కోరారు. రాష్ట్ర సెక్రటేరియట్ లో మంత్రిని కలిసి పురపాలక సంఘం అభివద్ధికి నిధులు ఇవ్వాలని కోరారు. త్రాగునీటి సరఫరా పథకం అభివద్ధికి వీధి దీపాల మెరుగుకు, పార్కులు స్మశాన వాటికల అభివద్ధి, మురికి కాలువల నిర్మాణం పారిశుధ్యం మెరుగు, బళ్లారి రహదారి విస్తరణ 60 మంది పారిశుధ్య కార్మికుల నియామకం, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, పట్టణం వెలుపల స్వాగత ద్వారా ఏర్పాటు, కుంటలు చెరువుల అభివద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని, పట్టణాభివద్ధికి చేయూతనందించాలని ఆమె మంత్రిని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు మున్సిపల్ ఛైర్పర్సన్ శిల్ప తెలిపారు.

పేదలకు విద్యుత్ మీటర్లు ఇవ్వాలి

ఎమ్మెల్యే అనంతకు సిపిఎం నాయకుల వినతి


ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాజీవ్‌కాలనీ పంచాయతీలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు కరెంటు సౌకర్యం కల్పించి, విద్యుత్ మీటర్లు ఇవ్వాలని సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం జగనన్న సురక్ష కార్యక్రమంలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం మండల తహశీల్దార్ పేదలపై ద్వేషం పెంచుకుని సంబంధిత కాలనీలో విద్యుత్ అధికారులకు కరెంటును సరఫరా నిలిపివేయాలని ఆదేశించడం దారుణంగా ఉందన్నారు. ఇప్పటికే తహశీల్దార్ కార్యాలయం దగ్గర అనేకసార్లు ఆందోళన చేసినప్పటికీ అధికారుల్లో ఏమాత్రం చలనం లేదని తెలిపారు. ఈ అధికారి పేదలకు ఒక న్యాయం ధనవంతులకు మరొక న్యాయం చేస్తున్నారని తెలిపారు. సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించి ఎమ్మెల్యే వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని విద్యుత్ శాఖ డివిజినల్ ఇంజినీర్‌ను ఆదేశించారు. అలాగే పేదలకు విద్యుత్ మీటర్లు కూడా ఇవ్వాలని సూచించారు. దీంతో కాలనీవాసులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాజీవ్‌కాలనీ ఉప సర్పంచి మసూద్, ఎంపిటిసి రమీజాబీ, సిపిఎం నాయకులు ప్రకాష్, బాబు, వలీ, శివ, మోహన్, లక్ష్మీనారాయణ, అశ్విని, వెంకటేశ్వరమ్మ, ఆచారి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డితో మాట్లాడుతున్న రాజీవ్‌కాలనీ సిపిఎం నాయకులు

పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న జిల్లా పరిశ్రమ శాఖ సహాయ సంచాలకులుకె.రాజశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మాజీ సైనిక ఉద్యోగులు పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా పరిశ్రమ శాఖ సహాయ సంచాలకులు కె.రాజశేఖర్‌రెడ్డి సూచించారు. గురువారం సైనిక సంక్షేమ శాఖ, జిల్లా పరిశ్రమల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మాజీ సైనిక ఉద్యోగులకు పరిశ్రమల ఆవశ్యకత, పరిశ్రమల స్థాపన, సాంకేతికత అనుమతులు మంజూరు, పారిశ్రామిక రాయితీలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహకాలు వంటి అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సైనిక ఉద్యోగులు పదవి విరమణ పొందిన తర్వాత కూడా ఉపాధి పొంది పదిమందికి ఉపాధి కల్పించేందుకు పరిశ్రమల ఏర్పాటు మంచి మార్గమన్నారు. ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలతో పరిశ్రమలు అభివృద్ధి చేసుకోవచ్చున్నారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సైనిక ఉద్యోగుల సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసులు, మత్స్యశాఖ ఉప సంచాలకులు శాంతి, అటల్ ఇంకుబేషన్ సెంటర్ డాక్టర్ చంద్రమౌళి, ఎల్‌డిఎం సత్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనలో ఆయకట్టు రైతులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలానికి ప్రధాన సాగునీటి వనరు అయిన తుంగభద్ర జలాశయంలో నీటిమట్టం ఆశాజనకంగా లేకపోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే కొందరు రైతులు ఇప్పటికే పంటలు సాగు చేశారు. అయితే పంటలకు సాగునీరు అందుతుందా లేదా అని రైతులు ఆవేదన చెందుతున్నారు. దీనిపై స్థానిక రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ తుంగభద్ర జలాశయం పరివాహక ప్రాంతం(పై భాగం)లో కర్నాటకలో చెక్ డ్యాంలు, మినీ జలాశయం నిర్మించి తుంగభద్ర జలాశయానికి రావాల్సిన నీటిని అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ఏటా జులై, ఆగస్టు నెలల్లో కర్నాటకలో భారీగా వర్షాలు కురిసి జలాశయానికి సమృద్ధిగా నీరు వచ్చేదని, ఈ సంవత్సరం వర్షాలు కురిసినా జలాశయానికి నీరు చేరకపోవడానికి కర్నాటకలో డ్యాం పైభాగంలో నిర్మించిన చెక్‌డ్యాంలు, మినీ జలాశయం కూడా ఓ కారణమన్నారు.

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి సన్మానం



ఎమ్మెల్యే పద్మావతిని సన్మానిస్తున్న దృశ్యం

శింగనమల :స్త్రీశిశుసంక్షేమ జాయింట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా నియమితులైన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతిని గురువారం అనంతపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఇందులో భాగంగా మండలంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ ఉమా శంకరమ్మ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు, యూనియన్ లీడర్లు కలిసి ఎమ్మెల్యే పద్మావతిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

బడుగుల విరోధి జగన్ : కాలవ



సమావేశంలో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

పేదల సంక్షేమాన్ని, అభివద్ధిని ఆటకెక్కించిన రాష్ట్ర సీఎం జగన్ బడుగుల విరోధిగా మారారని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు దుయ్యబట్టారు. గురువారం ఆయన రాయదుర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ఎస్సి,ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమ పథకాల్లో భారీగా కోతలు విధించి, వారికి తీరని ద్రోహం చేస్తున్నారన్నారు. బలహీన వర్గాల అభివద్ధికి ఏర్పాటైన కార్పొరేషన్లలో నాలుగేళ్లుగా రాయితీ ఋణాలు ఇవ్వడం లేదన్నారు. వాటిని పూర్తి నిర్వీర్యం చేసే, వాటి పాలక వర్గాలను ఉత్సవ విగ్రహాలుగా మార్చారని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో అక్రమ మార్గాల్లో లబ్ది పొందాలని వైసీసి నాయకులు కుట్రలు చేస్తున్నారన్నారు. టిడిపి సానుభూతిపరుల ఓట్లను తొలగించడానికి వైసీపీ కుతంత్రాలు చేస్తోందన్నారు. గ్రామాల్లో నాయకులు, పార్టీ బి.ఎల్.ఏ లు అప్రమత్తంగా ఉండాలన్నారు. చనిపోయిన ఓటర్ల వివరాలను ఓటర్ల జాబితా నుండి ఎందుకు తొలగించచలేదని అధికారులను కాలవ ప్రశ్నించారు. కార్యక్రమంలో ఆర్ టి ఎస్ ట్రైనర్ లక్ష్మీ ప్రసాద్, మన టీడీపీ యాప్ ట్రైనర్ మోహన్ రాజు, మండల కన్వీనర్లు గిరిమల్లప్ప, హనుమంతు, క్లస్టర్ ఇంఛార్జీలు సన్నన్న, నాగరాజు, జిల్లా రైతు ఉపాధ్యక్షుడు వెంకటేశులు, మైనార్టీ సెల్ ఉస్మాన్, ఆర్ టి ఎస్ ఇంఛార్జీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గుంతకల్లు దీక్ష శిబిరం వద్ద మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు - జిల్లావ్యాప్తంగా రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

సిఎం జగన్ మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు సమస్యలను పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు డిమాండ్ చేశారు. ఈమేరకు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలకు ముఖ్య అతిథిగా హాజరైన ఓబులు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చే ముందు మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తానని చెప్పడంతోపాటు అధికారంలోకి వచ్చాక కార్మికులు చేసే సేవలకు రూ.లక్ష ఇచ్చినా తక్కుతే అని అసెంబ్లీ సాక్షిగా మాట్లాడిన సిఎం జగన్ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయినా ఒక్క సమస్య పరిష్కరించిన పాపానపోలేదన్నారు. కార్మికులకు జీవో ఎంఎస్.7 ప్రకారం స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాలు ఇవ్వాల్సి ఉండగా అను స్కిల్ వేతనాలు ఇస్తూ కార్మికుల శ్రమను దోచుకుంటున్నారన్నారు. అలాగే పార్కుల్లో పనిచేస్తున్న కార్మికులకు హెల్త్ అలవెన్స్, రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ రెగ్యులర్ కార్మికులందరికీ సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేస్తామని చెప్పి మోసం చేశారన్నారు. అలాగే మున్సిపల్ కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయాలన్నారు. సకాలంలో యూనిఫాం, రక్షణ పరికరాలు, పనిముట్లు, రెగ్యులర్ కార్మికులకు సరెండర్ లీవ్‌లు ఇవ్వాలన్నారు. మలేరియా, కోవిడ్, గార్బేజ్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే సమాన పనికి, సమాన వేతనం ఇవ్వాలని లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షల్లో నగర కార్యదర్శి తిరుమలేష్, జిల్లా కోశాధికారి బత్తల ఆదినారాయణ, కోశాధికారి లక్ష్మీనరసమ్మ, ఉపాధ్యక్షులు శశీంద్రకుమార్, ఎంఆర్‌పిఎస్ అనుబంధ నాయకులు నల్లప్ప కూర్చొన్నారు. వీరికి ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు, నగర కార్యదర్శులు వెంకట్ నారాయణ, ముత్తుజ, కుళ్లాయమ్మ, కృపమ్మ, మరియమ్మ, సరళ, మంజుల, ఇంజినీరింగ్ విభాగ మహిళలు కుళ్లాయమ్మ, కాంతమ్మ లక్ష్మీదేవి, అన్నపూర్ణ, రత్న సుజాత, 150 మంది మహిళలు పాల్గొన్నారు.

గుంతకల్లు : పాదయాత్ర సందర్భంగా సిఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు అనుబంధ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు దాసరి శ్రీనివాసులు, యూనియన్ కార్యదర్శి కె.నరసయ్య మాట్లాడుతూ సిఎం జగన్ రెడ్డి పాదయాత్రలో తమ ప్రభుత్వం వేస్తే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తానని చెప్పి నాలుగున్నర ఏళ్లు గడచినా నేటికీ ఆ హామీ అమలు చేయలేదన్నారు. అదేవిధంగా సిపిఎస్ రద్దు చేస్తానని చెప్పారన్నారు. కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం చేసేవరకు వారు చేపట్టే ఆందోళనలకు సిఐటియు సంపూర్ణ మద్దతు ఇస్తోందన్నారు. దీక్షలకు నాయకురాళ్లు రంగమ్మ, పద్మ, శంకరమ్మ, సరస్వతి, రహేజా బేగం, లక్ష్మీదేవి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఎల్.జగదీష్,నాయకులు హనుమంతు,రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గుత్తిలో సిఐటియు అనుబంధ సంస్థ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక అధ్యక్ష, కార్యదర్శులు కె. సూర్యనారాయణ, ఎన్.రామాంజనేయులు మాట్లాడుతూ పారిశుధ్య కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. పనిముట్లని ఇవ్వాలన్నారు. జనాభాకు సరిపడా కార్మికులను నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మహేష్, ఎన్.హరికుమార్, సహాయ కార్యదర్శి టి.సుంకన్న, కె.రాజశేఖర్, కోశాధికారి బాల రంగన్న, నాయకులు ఈశ్వరయ్య, లక్ష్మయ్య, బి.నాగేంద్ర, చంద్ర, కె.ఆంజనేయులు, బి.రాజశేఖర్, పుల్లన్న, లక్ష్మీదేవి ఎం.ఎల్లప్ప, నల్లమ్మ, వీరన్న, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆర్టీసీ బస్సు, కారు ఢీ..వ్యక్తికి గాయాలు

బుక్కరాయసముద్రం : మండలంలోని వడియంపేట దగ్గర గురువారం ఆర్టీసీ బస్సు, కారు ఢీకొనడంతో వ్యక్తి గాయపడ్డారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు.. వడియంపేట దగ్గర కర్ణాటకకు చెందిన కారును ఓ ఆర్టీసీ బస్సును ఢీకొంది. దీంతో కారులోని వ్యక్తికి తీవ్రగాయాలైనట్లు తెలిపారు. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం అనంతపురం తరలించినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మూడు ట్రాక్టర్లు సీజ్

నార్పల : మండల పరిధిలోని కురగానపల్లి గ్రామ సమీపంలో నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను విజిలెన్స్ ఎడి విజయలక్ష్మి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి సీజ్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎడి మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్నారన్న సమాచారంతో ఆకస్మికంగా దాడులు నిర్వహించి మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తెలిపారు. సీజ్ చేసిన ట్రాక్టర్లకు అపరాధ రుసుం విధించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, ఎఎస్ఐ నాగరాజు, విజిలెన్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో గొర్రెల కాపరి మృతి

ప్రజాశక్తి-శింగనమల



మృతిచెందిన కొయిటాకు పక్కీరప్ప

మండల పరిధిలోని పెరవలి గ్రామంలో గొర్రెల కాపరి గుండెపోటుతో మృతిచెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కొయిటాకు పక్కీరప్ప (53) గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగించేవాడు. ఇందులో భాగంగానే గురువారం ఉదయం కూడా గొర్రెలను మేపేందుకు గ్రామ సమీపంలోని కొండకు తీసుకెళ్లాడు. గొర్రెలు మేపుతుండగా కుప్పకూలి పడిపోయాడు. గమనించిన తోటి కాపరులు దగ్గరకు వెళ్లి చూశారు. అయితే అప్పటికే మతి చెందడంతో బంధువులకు సమాచారం అందజేశారు. వారు వెళ్లి మతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. కుటుంబ పెద్ద మతి చెందడంతో కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా పామిశెట్టి గోవిందు



అనంతపురం : ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా పామిశెట్టి గోవిందును నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు బి.ఆనంద్‌ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. చేనేతల అభివృద్ధికి, చేనేత వృత్తి పరిరక్షణ, చేనేతల అభ్యున్నతికి కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షులు కోరారు. క్రమశిక్షణ ఉన్న బాధ్యులుగా వ్యవహరించాలని సూచించారు.

పట్టు పరిశ్రమతో అధిక ఆదాయం : ఎంపిపి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపిపి సునీత

పట్టు పరిశ్రమతో అధిక ఆదాయం పొందవచ్చని ఎంపిపి దాసరి సునీత తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఆర్‌బికెలో జిల్లా పట్టు పరిశ్రమల శాఖ అధికారి డి.ఆంజనేయులు అధ్యక్షతన వైఎస్ఆర్ పట్టుబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కువగా రైతులు సిరికల్చర్ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. కావున అధికారులు రైతులకు అవగాహన కల్పించి మల్బరీ సాగుకు ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం షెడ్ల నిర్మాణం, పట్టుపురుగుల పెంపకం కోసం అనేక సబ్సిడీలు అందిస్తున్నట్లు తెలిపారు. వీటిని ఉపయోగించుకుని రైతులు పట్టు పురుగుల పెంపకం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో అగ్రి అడ్వైజరీ బోర్డు ఛైర్మన్ పెద్ద కొండయ్య, సభ్యులు శివారెడ్డి, సిరికల్చర్ ఆఫీసర్ మెహతాజ్ సుల్తానా, ఎఇఒ జ్యోతి, వైసిపి నాయకులు పుల్ల నారాయణస్వామి, సిరికల్చర్ సిబ్బంది, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు బికెఎస్ విద్యార్థులు



రాష్ట్ర బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

బుక్కరాయసముద్రం : రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు బుక్కరాయసముద్రం హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధాన ఉపాధ్యాయురాలు వసుంధర, పీడీ గోపాల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న డి.చరిత, సి.అఖిల్ ఈనెల 17న అశోక్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయికి జట్టుకు ఎంపికైన జట్టు గోదావరి జిల్లా రామచంద్రాపురంలో 21 నుంచి 23వ తేదీ వరకూ జరిగే 8వ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ బాల, బాలికల టోర్నమెంట్‌లో పాల్గొంటుందన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం, లలితమ్మ, తోటి విద్యార్థులు అభినందించారు.

సిఎం జగన్‌తోనే ఆర్థికాభివృద్ధి

ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-గుత్తి



మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వై.వి.ఆర్

సిఎం జగన్‌తోనే ప్రజల ఆర్థికాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బాచుపల్లి గ్రామంలో సర్పంచి కె.రమేష్‌బాబు ఆధ్వర్యంలో గడప, గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గుంతకల్లు మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ వై.నైరుతీరెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలను ఆదుకునేందుకు నవరత్న పథకాలను అమలు చేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రతి ఒక్కరి మద్దతు జగనన్నకు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిపి విశాలాక్షి, మార్కెట్ యార్డు ఛైర్మన్ సునీలాయాదవ్, కో ఆప్షన్ నెంబర్ ఖాసీంవలి, మాజీ ఎంపిపి కోనా మురళీధర్‌రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, జిల్లా నాయకులు కె.మధుసూదన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, నాయకులు కె.కృష్ణమోహన్‌నాయుడు, కె.రవి, వై.సుభాష్‌రెడ్డి, శ్రీనివాసులు, శివ, అంజినప్ప, బాలరంగయ్య, ఆనంద్, లాలూనాయక్, నాగరాజు, కౌన్సిలర్లు వరద, వాల్మీకి శివ, ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని విఆర్ఎల దీక్షలు

ప్రజాశక్తి-గుత్తి



బొమ్మనహాల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న విఆర్ఎలు

గ్రామ రెవెన్యూ సహాయకులకు ప్రభుత్వం పే స్కేల్ అమలు చేయాలని మండల విఆర్ఎల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చిరంజీవి, నారాయణస్వామి డిమాండ్ చేశారు. విఆర్ఎల రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నామినల్‌గా పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని, భత్యంతో కూడిన వేతనాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రికవరీ చేసిన డిఎను తిరిగి చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మండల విఆర్ఎల సంఘం నాయకులు సుధాకర్, పెద్దన్న, రాంప్రసాద్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : గ్రామాల్లో పనిచేస్తున్న విఆర్ఎల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో వీఆర్ఎల సంఘం ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపట్టారు. దీక్షల్లో మండల విఆర్ఎల సంఘం అధ్యక్షుడు నారాయణస్వామి, ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, కార్యదర్శులు సురేష్, సందీప్, ఓబన్న, రాము, శ్రీనివాసులు దేవరాజు, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : వేతనాలు పెంచాలని కోరుతూ గురువారం మండల పరిధిలోని విఆర్ఎలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నేలపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు మారుతి మాట్లాడు తూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వేతనం రూ. 20వేలకు పెంచాలని, విఆర్ఒలు, అటెండ ర్లుగా పదోన్నతులు కల్పించాలని, మృతిచెందిన విఆర్ఎల కుటుంబాలకు కారుణ్య నియామకాల చేపట్టాలని, ప్రభుత్వ ఉద్యోగులతో పాటు టిఎ, డిఎ పెంచాలని డిమాండ్ చేశారు. ఈక్రమంలో వారు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విధులు బహిష్కరించి నేలపై కూర్చున్నారు.

రైల్వేషెడ్‌లో ఉచిత వైద్యశిబిరం

గుత్తి : రైల్వే లోకో డీజిల్‌షెడ్‌లో మాతృశ్రీ ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా వైద్య నిపుణులు ప్రశాంత్‌రెడ్డి, మహేష్, మౌనిక, తదితరులు రైల్వే కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే సీనియర్ డిజిల్ మెకానికల్ ఇంజినీర్ రమేష్, ఎడిఎంఇ సుంకన్న, ఎంజిఎస్-ఎస్ఇ మనోజ్, దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యదర్శి రామాంజనేయులరెడ్డి, ఎస్సీ, ఎస్టీ యూనియన్ ఛైర్మన్ మనోజ్, ఎడిఎస్ నారాయణ, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ ఛైర్మన్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎంఇఒ-2కు సన్మానం

యాడికి : ఇటీవల మండల రెండవ ఎంఇఒగా బాధ్యతలు స్వీకరించిన ఆర్.ధనలక్ష్మిని గురువారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఇఒ కాశప్ప, ప్రధానోపాధ్యాయులు పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. గుత్తి నుంచి బదిలీపై వచ్చిన ఆమెను సన్మానించి మిఠాయిలు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, నాన్ టీచింగ్ స్టాఫ్ రామక్రిష్ణ, విశ్వనాథ్, ఓబులేసు, రామాంజి, రంగస్వామిరెడ్డి, బాలు, తదితరులు పాల్గొన్నారు

విద్యాసామగ్రి పంపిణీ

గుత్తి : పట్టణంలోని లండన్ మిషన్ బాలుర ఎయిడెడ్ పాఠశాలలో పూర్వపు విద్యార్థులు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. 1971-72 సంవత్సరంలో 5వ తరగతి చదివిన విద్యార్థులైన విశ్రాంత వార్డెన్ మల్లికార్జునరావు, విశ్రాంత హెచ్ఎం ఫక్రుద్దీన్, విశ్రాంత ఏడీసీ ఇమాముద్దీన్, విశ్రాంత ఉపాధ్యాయులు షర్మిల,రాజేశ్వరి కలిసి పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిల్లు తదితర విద్య సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయులు మేరీ శైలకుమారి, శషాహీన్, శ్రీనివాసులు, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



సామగ్రిని చూపుతున్న విద్యార్థులు

మంత్రి రోజా.. నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడు..!

ప్రజాశక్తి-అనంతపురం

జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కళ్యాణ్‌ను విమర్శించేటప్పుడు మంత్రి రోజా నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని జనసేన పార్టీ నగర కార్యదర్శి వడ్డే వెంకటేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నీతి, నిజాయితీకి మారుపేరైన పవన్‌కళ్యాణ్‌ను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. రోజా తీరు ఇలాగే కొనసాగితే రోడ్ల మీద కూడా తిరగనివ్వమని హెచ్చరించారు. మీ జగన్‌రెడ్డిలాగా నువ్వు కూడా బయటికి రావాలంటే పరదాలు కట్టుకోవాలని సూచించారు. పవన్‌కళ్యాణ్ ప్యాకేజీ తీసుకున్నట్లు మీ దగ్గర ఆధారాలు ఉంటే రుజువు చేయ్.. లేకుంటే రాజీనామా చేస్తావా.. అని సవాల్ విసిరారు.



ఎరువులను దింపుతున్న హమాలీలు

రైతన్నలకు అందుబాటులో ఎరువులు

ఎఫ్ఎసిఎస్ ఛైర్మన్ శ్రీరాములు, సిఇఒ ఎర్రిస్వామి

ప్రజాశక్తి-ఉరవకొండ

రైతన్నలకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని విడపనకల్ రైతు సేవా సహకార సంఘం ఛైర్మన్ బోయ శ్రీరాములు, సిఇఒ ఎరిస్వామి తెలిపారు. గురువారం మండల పరిధిలోని పాల్తూరు గ్రామంలో ఉన్న సొసైటీ ఎరువుల విక్రయ కేంద్రంలో జిల్లా కేంద్రం నుంచి వచ్చిన ఎరువులను నిల్వ ఉంచినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి, జోనల్ ఇన్‌ఛార్జి ప్రణయ్‌రెడ్డి, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు ఛైర్మన్ రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అగ్రికల్చర్ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఉరవకొండ డివిజన్ ఎడిఎ పద్మజ, విడపనకల్ ఎఒ పెన్నయ్య స్పందించి ఎరువులను సరఫరా చేసినట్లు తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యాసిడ్ దాడులు అరికట్టడమే లక్ష్యం : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం



యాసిడ్ దాడులను అరికట్టడమే లక్ష్యంగా పని చేద్దామని ఎస్పీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో బంగారు షాపుల యజమానులు, ల్యాబొరేటరీలు కలిగిన కళాశాలల ప్రతినిధులు, యాసిడ్ విక్రయాల దుకాణదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై, బాలికలపై ప్రాణాంతకమైన యాసిడ్ చల్లడం వంటి తీవ్రమైన నేరాలు కట్టడి చేయడానికి చర్యలకు ఉపక్రమించామన్నారు. ముఖ్యంగా యాసిడ్, కరోజివ్స్ విక్రయాలు జరపాలంటే తప్పనిసరిగా జిల్లా కలెక్టర్చే లైసెన్స్ పొంది ఉండాన్నారు. జీఎస్టీ కూడా తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. ప్రతి 15 రోజులకోసారి యాసిడ్ నిల్వలు, సేల్స్‌కు సంబంధించిన నివేదికలు సమర్పించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో 18 సంవత్సరాలలోపు మైనర్లకు యాసిడ్, కరోజివ్స్ అమ్మరాదన్నారు. రెవెన్యూ సబ్ డివిజన్ల అధికారులు దాడులు చేసిన సమయంలో నిబంధనలు అతిక్రమించినట్లు తేలితే రూ.50 వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అనంతపురం రూరల్ డీఎస్పీ శివారెడ్డి, డీసీఆర్బీ సీఐ విశ్వనాథ్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండ వైఎస్ఆర్ బీమా

అనంతపురం సిటీ : రాష్ట్రంలోని పేదలకు వైఎస్ఆర్ బీమా అండగా నిలుస్తోందని అనంత రూరల్ రుద్రంపేట సర్పంచి భర్త ఆదినారాయణనాయక్, ఎంపిటిసి నారాయణమ్మ తెలిపారు. అనంత రూరల్ మండలం రుద్రంపేట గ్రామానికి చెందిన జె.పద్మావతి మంగళవారం తెల్లవారుజామున ఆనారోగ్యంతో మృతిచెందడంతో వైఎస్ఆర్ బీమా కింద రూ.1లక్ష బీమా మంజూరు చేయడంతో చెక్కును మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి భర్త ఆదినారాయణ నాయక్, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అధికారి ఎంఎల్ఎన్ శ్రావణ్, వాలంటరీ పవన్‌కుమార్, వార్డు సభ్యురాలు సుభద్రమ్మ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



గుత్తిలో బీమా సొమ్మును అందజేస్తున్న అధికారులు

గుత్తి : ఎపిఎస్ ఆర్టీసీ గుత్తి డిపోలో పని చేస్తూ మృతిచెందిన డ్రైవర్ కెసి.రెడ్డి భార్యకు అధికారులు గురువారం బీమా సొమ్ము పంపిణీ చేశారు. కేసి.రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో మంజూరైన ఈడిఎల్ ఐఎఫ్ బీమా సొమ్ము రూ.6 లక్షలు చెక్కు రూపంలో మృతుడి భార్యకు ఆఫీసు సూపరింటెండెంట్ ఎ. శ్రీపాద అందజేశారు.

పశు వైద్యశాల తనిఖీ

శెట్టూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ పశువైద్యశాలను పశువైద్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెంకటేష్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువైద్య సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి సత్వర సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ నాగలింగేశ్వర్‌రెడ్డి, వైద్యాధికారులు ప్రసాద్, సాయి, సుమంత్, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నాయకుల కనుసన్నల్లోనే ఇసుక అక్రమాలు

మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం : రాయదుర్గం నియోజకవర్గంలో వేదవతి, హగరి నదినుండి వైసీపీ నాయకులు యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్న విషయం అధికారుల తాజా తనిఖీల్లో బట్టబయలైందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈమేరకు గురువారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. కనేకల్లు మండలం రచ్చుమర్రి వద్ద ఇసుకను తోడుతున్న హిటాచి యంత్రాన్ని, పెద్ద ఎత్తున నిల్వచేసిన ఇసుక డంప్‌ను ఇటీవల విజిలెన్స్ అధికారులు సీజ్ చేసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. భవిష్యత్తుకు గ్యారెంటీ బస్సు యాత్రలో భాగంగా గతనెల 29న తెలుగుదేశం నాయకులు రచ్చుమర్రి అక్రమ ఇసుక వ్యవహారాన్ని వెలుగులోకి తెచ్చిందన్నారు. అదేరోజు మైన్స్ విజిలెన్స్ అధికారులు తనిఖీ చేసిఉంటే పెద్ద ఇసుక డంప్ ను స్వాధీనం చేసుకునే అవకాశం ఉండేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ఒత్తిడి మేరకు అప్పట్లో దానిపై చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. రచ్చుమర్రి వద్ద అధికారిక రీచ్ లేకపోయినా నెలల తరబడి పెద్దఎత్తున టిప్పర్లు, లారీల్లో కర్ణాటక రాష్ట్రానికి ఇసుకను తరలించడం వెనుక ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుర్నాథరెడ్డిల ప్రమేయం ఉన్నట్లు స్పష్టమవుతోందన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాపు కనుసన్నల్లో జరుగుతున్న ఇసుక దందాపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని కాలవ డిమాండ్ చేశారు.

రోగులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-నార్పల




కేక్ కోస్తున్న ఆలం నరసానాయుడు అభిమానులు, టిడిపి కార్యకర్తలు

నియోజకవర్గ దిసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక ఆసుపత్రిలోని రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ముందుగా మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎవరు ఆపదలో ఉన్నా తానున్నానంటూ ముందుకొచ్చే నాయకుడు నరసానాయుడు అన్నారు. ఆయన ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని కాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలం నరసానాయుడు సోదరుడు జిల్లా టిడిపి నాయకుడు ఆలం వెంకట నరసానాయుడు, మాజీ జెడ్పిటిసి గూగూడు జాఫర్‌వలి, మాజీ ఎంపీటీసీలు రాఘవనాయుడు, గూగూడు రాజన్న, బండ్లపల్లి సర్పంచి నారాయణమ్మ, చంద్రబాబునాయుడు, రవికుమార్, నాగేంద్ర, మురళి, లక్ష్మీనారాయణ, శంకర్, రాజేష్, రాము, టిడిపి కార్యకర్తలు, ఆలం అభిమానులు పాల్గొన్నారు.

తప్పుల్లేని ఓటర్ల జాబితా తయారీకి సహకరించండి

ప్రజాశక్తి-రాయదుర్గం



రాయదుర్గంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

తప్పులు లేని ఓటర్ల జాబితా తయారీకి రాజకీయ పార్టీలు సహకరించాలని రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గం ఓటర్ల నమోదు అధికారి కేశవ నాయుడు కోరారు. గురువారం స్థానిక తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో రెవెన్యూ మీటింగ్ హాలులో వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21వ తేదీ నుండి వచ్చే నెల 21వ తేదీ వరకు రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని పోలింగ్ బూత్ స్థాయి ఇంటింటా ఓటరు పరిశీలన కార్యక్రమం జరుగుతుందన్నారు. పోలింగ్ బూత్ స్థాయి అధికారి ఇంటింటా వెళ్లి ఆ ఇంటిలో గల ఓటర్ల వివరాలను జాబితాతో సరిపోల్చు తారన్నారు. ఎక్కడైనా ఓటర్ పేరు రెండు చోట్ల నమోదు అయ్యి ఉంటే అలాంటివి తొలగించబడతాయన్నారు. అంతేకాక ఓటర్లు మరణిస్తే వారి పేర్లను కూడా జాబితా నుండి తొలగిస్తారు అన్నారు. బూత్ స్థాయి అధికారితో పాటు రాజకీయ పార్టీ బూత్ స్థాయి ఏజెంట్ కూడా ఈ పరిశీలనలో పాల్గొనవచ్చు అన్నారు. సమావేశంలో రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాల తహసిల్దార్లు, ఎన్నికల అధికారులు, వివిధ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్ : నేటి నుంచి ఓటర్ల సర్వే నిర్వహించనున్నట్లు తహశీల్దార్ బి.రాము తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 276 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఆయా కేంద్రాల్లో బూత్ లెవెల్ ఆఫీసర్ ఇంటింటికీ వెళ్లి ఓటర్ల సర్వే చేయనున్నట్లు తెలిపారు. ఈ సర్వేలో శాశ్వత వలస వెళ్లినవారు, మరణించిన వారి పేర్లను జాబితా నుంచి పూర్తిగా తొలగించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా మార్పులు, చేర్పులు, చిరునామాల మార్పులు చేయనున్నట్లు తెలిపారు. నేటి నుంచి ఆగస్టు 21వతేదీ వరకూ సర్వే చేయనున్నట్లు తెలిపారు. ప్రధానంగా ఈ సర్వేలో వాలంటీర్ల ప్రమేయం ఉండదన్నారు. అధికారుల వెంట కేవలం బిఎల్ఒ మాత్రమే ఉంటాడన్నారు. ఒకవేళ బిఎల్ఒ లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పుట్లూరు : ఓటర్ నమోదుపై వివిధ పార్టీ నాయకులతో డిప్యూటీ తహశీల్దార్ మల్లేష్‌ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుంచి ఆగస్టు 21వతేదీ వరకూ ఓటరు జాబితాపై ఇంటింటికీ వెళ్లి సర్వే చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' చారిత్రాత్మకం

ఎమ్మెల్యేలు అనంత, వై.వెంకటరామిరెడ్డి



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

దేశంలో ఏరాష్ట్రంలో లేనివిధంగా సీఎం జగన్ నాయకత్వంలోని ప్రభుత్వం తీసుకొచ్చిన 'జగనన్న సురక్ష' కార్యక్రమం ఓ చారిత్రాత్మకమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. నగరంలోని యువజన కాలనీ, హమాలీ కాలనీ, రాజీవ్ కాలనీ, నారాయణపురంలో గురువారం 'జగనన్న సురక్ష' కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా లబ్ధిదారులకు వివిధ ప్రభుత్వ సేవలకు సంబంధించి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయన్నారు. అర్హత ఉండి వివిధ కారణాలతో రాకపోతే మళ్లీ వాటిని సరిదిద్ది పథకాల ప్రయోజనాలను అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడం కోసమే 'జగనన్న సురక్ష' క్యాంపులను జూలై 1వ తేదీ నుంచి నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా విశేష స్పందన వస్తోందన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, జెసిఎస్ కన్వీనర్లు ఆలమూరు శ్రీనివాసరెడ్డి, చింతకుంట మధు, కార్పొరేటర్లు గోగుల లక్ష్మీదేవి, రహంతుల్లా, దుర్గాదేవి, వి.మీనాక్షి, ఎం.నరసింహులు, కమల్ భూషణ్, సర్పంచి ఆశాబీ, జెడ్పిటీసీ చంద్ర, ఎంపిపి వరలక్ష్మి, రాజీవ్ కాలనీ పంచాయతీ సెక్రటరీ ముత్యాలరెడ్డి, విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

బెలుగుప్ప : రాష్ట్ర ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సిఎం జగన్ పాలనలో సంక్షేమ ఫలాలు అందుతున్నాయని తహశీల్దార్ డి.ఓబులేసు, ఎంపిడిఒ రామచంద్ర అన్నారు. మండల పరిధిలోని తగ్గుపర్తి గ్రామంలో సర్పంచి మమత, వైస్ ఎంపిపి పుష్పావతి, నక్కలపల్లి సర్పంచి రామిరెడ్డి శ్రీరంగపురం, సర్పంచి సాహితీరెడ్డి అధ్యక్షతన గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పలువురికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిలువెంద అధ్యక్షుడు శివలింగప్ప, ఆవులన్న మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు వెంకట్‌నాయుడు, ఎంపిటిసి వరలక్ష్మి, మారుతీరెడ్డి, మాజీ ఎంపిటిసి గోపాల, స్టోర్ డీలర్ ఎర్రిస్వామి, హౌసింగ్ ఎఇ శివారెడ్డి, పంచాయతీ సెక్రటరీ శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : సిఎం జగన్ దూరదృష్టితో అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా లక్షల మందికి లబ్ధి చేకూరుతోందని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ అమలు చేస్తున్న సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చిందన్నారు. నియోజకవర్గంలోని గుంతకల్లు, గుత్తి, పామిడి పట్టణ, మండలాల్లో వివిధ ధ్రువపత్రాల కోసం 28,427 మంది దరఖాస్తు చేసుకోగా 27,772 మందికి ధ్రువపత్రాలు అందజేసినట్లు తెలిపారు. అంతేగాకుండా వివిధ రకాల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. అలాగే పట్టణంలో ప్రధాన సమస్యలైన ధర్మవరం లెవల్ క్రాసింగ్ గేటు, కసాపురం రోడ్డులోని రైల్వే బ్రిడ్జి సమస్యలు అక్టోబర్ నెలలోపు పూర్తి అవుతాయన్నారు. అదేవిధంగా దోనిముక్కల రోడ్డు సిమెంటు రోడ్డుగా (డబుల్) మారనుందని వివరించారు. ఈ సమావేశంలో వైసిపి రాయలసీమ ఎస్సీ సెల్ కన్వీనర్ జింకల రామాంజినేయులు, పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, మండల కన్వీనర్ మోహన్, నాయకులు దేవేంద్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండలంలోని మడ్డిపల్లి, కుమ్మనమల గ్రామ సచివాలయాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ రకాల సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేందుకు సిఎం జగన్ సచివాలయాలను ఏర్పాటు చేశారన్నారు. అప్పటి నుంచి గ్రామాల్లోనే చాలా సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఎవరూ ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి 11 రకాల సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో ప్రెసిడెంట్ రామసుబ్బారెడ్డి, తహశీల్దార్ మోహన్‌కుమార్, ఎంపిడిఒ యోగానందరెడ్డి, ఇఒఆర్‌డి ఆనంద్‌ప్రసాద్, ఆర్ఐ కిష్టప్ప, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

శెట్లూరు : మండలంలోని ములకలేడు గ్రామంలో సర్పంచి లక్ష్మీ నాగరాజు ఆధ్వర్యంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. అంతేగాకుండా ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటీసీ మంజునాథ, మండల అభివృద్ధి అధికారిణి మైథిలీ, ఎంపిపి సోమనాథ్‌రెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ పి.తిమ్మరాజమ్మ, పోస్టు క్రిష్టప్ప, కన్వీనర్ శివన్న, ఇఒఆర్‌డి రఘురాం, కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, పంచాయతీ సెక్రటరీ రామాంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.



ఉరవకొండలో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న నాయకులు

ఉరవకొండ : సిఎం జగన్ అందిస్తున్న పాలన దేశానికే ఆదర్శమని విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పవతి భీమ్‌రెడ్డి, జెడ్పిటిసి హనుమంతు అన్నారు. గురువారం విడపనకల్ మండల పరిధిలోని కరకముక్కల గ్రామంలో జరిగిన 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ప్రభుత్వం అందిస్తున్న సేవలు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. అనంతరం పలువురికి పలు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఈరమ్మ, జెసిఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి, సర్పంచి రామాంజనేయులురెడ్డి, ఎంపిపి మల్లికార్జున, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఉమారాణి, వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, రాముడెడ్డి, సచివాలయ సిబ్బంది, గృహసారథులు, వాలంటీర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : ప్రభుత్వం పేదలకు జగనన్న సురక్ష ద్వారా కల్పించిన ఉచిత ధ్రువపత్రాల పంపిణీని సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ నాగభూషణం, ఎంపిడిఒ కుళ్లాయిస్వామి కోరారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం పెద్దవడుగూరు సచివాలయం-12 కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురికి ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి శర్మ, ఉప తహశీల్దార్ వెంకటేశ్వరమ్మ, ఆర్ఎస్ఐ శ్రీనివాసులు, కార్యదర్శులు కుళ్లాయిస్వామి, అనిల్, ప్రభాకర్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.



గుంతకల్లులో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి



శెట్టూరు మండలంలో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న నాయకులు

శ్రీకృష్ణ ఆలయంలో దేవాదాయ రాష్ట్ర గౌరవ సలహాదారు పూజలు

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని కొత్తపేట గ్రామ సమీపంలో వెలసిన శ్రీకృష్ణ దేవాలయాన్ని ఎపి రాష్ట్ర దేవాదాయ శాఖ గౌరవ సలహాదారులు జ్వాలాపురం శ్రీకాంత్ గురువారం దర్శించుకున్నారు. ఇందులో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పల ఆనంద్‌కుమార్, కార్యవర్గ సభ్యుడు సుధీంద్రనాథ్, వంశీకృష్ణ, అలా కమిటీ నాయకులు శ్రీనివాసులు, ఓబయ్య, ఏకాంతమయ్య, తదితరులు పాల్గొన్నారు.



శ్రీకష్ణ ఆలయంలో పూజలు చేస్తున్న ఎపి రాష్ట్ర దేవాదాయ శాఖ గౌరవ సలహాదారులు జ్వాలాపురం శ్రీకాంత్

భారతికి హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఆపన్నహస్తం

ప్రజాశక్తి-శింగనమల

మండలంలోని నాగులగుడ్డం గ్రామానికి చెందిన డాక్టర్ సాకే భారతికి హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం రామసుబ్బారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శంకర్‌నారాయణ గురువారం రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతి ఒక్క గ్రామానికే కాదు.. రాష్ట్రం, దేశానికే గర్వకారణమన్నారు. ఆకలికి కష్టపడటాన్ని అలవాటు చేసుకుంటూ ఆలోచనతో బతకడం నేర్చుకోవడంతోపాటు లక్ష్యం దిశగా ముందుకు సాగడం సంతోషకరమన్నారు. ఇదుకు నిలువెత్తు నిదర్శనం డాక్టర్ సాకే భారతి అన్నారు. దినసరి కూలీగా పని చేస్తూ డాక్టరేట్ పొందడం ఎందరికో స్ఫూర్తినిచ్చిందన్నారు. అనంతరం భారతిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ పబ్లిక్ పాఠశాల యాజమాన్యం, తదితరులు పాల్గొన్నారు.



భారతి కుటుంబానికి చెక్కు అందజేస్తున్న హైదరాబాదు పబ్లిక్ స్కూల్ ప్రతినిధులు

ఆస్పత్రి వద్ద అన్నదానం



అన్నదానం చేస్తున నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి

ప్రజాశక్తి-అనంతపురం

నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వాసుపత్రి వద్ద పేదలకు అన్నదానం చేశారు. ట్రస్టు సభ్యులు ఎన్.ఎస్.బద్రీనాథ్, సతీమణి ఎన్.ఎస్.వాణిశ్రీ, కుమారుడు ఎన్.ఎస్.శ్రేయాష్ జన్మదినం సందర్భంగా అన్నదానం చేసినట్లు ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి ఆసుపత్రికి వస్తున్న రోగులు, రోగుల బంధువులకు ఆకలి తీర్చడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఎఐ పీడీ జీవన్‌లాల్ మీనా, సతీమణి అమర్ భాయి, ట్రస్టు సభ్యులు కవిన్, ఆదిత్య, సుబ్రమణ్యం, నబిరసూల్, కిష్టప్ప, సుబ్బారావు, బాలరాజు, జగన్నాథ్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్షపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి-ఉరవకొండ

మండలంలోని పెద్దకౌకుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న లత్తవరం గ్రామంలో లింగవివక్షపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్, జిల్లా వైద్యాధికారుల ఆదేశాల మేరకు పెద్దకౌకుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు పివి.అనికేత్, లక్ష్మీచందన ఆధ్వర్యంలో హెల్త్ ఎడ్యుకేటర్ యు.వెంకటరమణ లత్తవరం గ్రామాన్ని దత్తత తీసుకుని క్రమపద్ధతిలో ఫ్రీ సర్వే ద్వారా డేటాను సేకరించి అందుకు అనుగుణంగా వివిధ రకాల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ఐపిసి, గ్రూప్ మీటింగ్స్, మాస్ మీటింగ్స్ ద్వారా లింగ వివక్షపై కల్పించారు. ఇందులో భాగంగా ఆడబిడ్డను పుట్టనిద్దాం, పెరగనిద్దాం, చదవనిద్దాం, గౌరవిద్దాం అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ నాగరత్నమ్మ, ఎంఎల్ హెచ్‌పి పవన్‌కళ్యాణ్, ఆరోగ్య సహాయకుడు ఎం.నాగరాజు, ఎఎన్ఎం చంద్రకళ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.